# 27. బందిపోటు భూపత్

ఉత్తర భారతంలోని సౌరాష్ట్రకు చెందిన దౌదర్ధా గ్రామం మీద వర్షాకాలపు మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయ్. దౌదర్ధా గ్రామం ఆ ప్రాంతపు చెప్పుకోదగిన పట్టణమయిన బుర్వాలాకు ఆరు మైళ్ళ దూరంలో ఉంది. అక్కడంతా వ్యవసాయదారులూ, కౌలుదార్లూను.

గ్రామస్తులు అప్పుడప్పుడే లేచి పొలం పనులకు పోవటానికి సిద్ధమవుతున్నారు. వారిలో అధిక సంఖ్యాకులు ప్రస్తుతం భూస్వామిగా చలామణీ అవుతున్న మాజీ మహారాజా వారి కౌలుదార్లే. ఆ సంస్థానంలోరాజా వారికి వేలాది ఎకరాల భూమి ఉంది. శ్రీవారి సంస్థానాన్ని భారత భూభాగంలో కలిపేసుకోవటంతో శ్రీవారి రాజ్యాధికారం ఊడింది, నిజమే! కానీ, సంస్థాన ప్రజల ఆయువు పట్లలో అధిక భాగం శ్రీవారి దస్తావేజుల్లోనే ఉన్నాయి, వారి భూముల మీదనే ఉన్నాయి.

ఆ శుభోదయాన గ్రామీణులు యథావిధిని తమతమ పనులకు సమాయత్తమవుతూండగా,...!

గ్రామ శివార్లలో ఓ సాయుధ పోలీసు దళం ప్రత్యక్షమయింది. వారందరి వద్దా ఆధునికమైన ఆయుధాలున్నాయ్!

ఆ బృందం నాయకుడు పోలీసు ఆఫీసర్లా లేడు. పోలీసు వేషంలోని మహారాజులా ఉన్నాడు. దళంలోని వారంతా అతని కనుసన్నలతోనే కార్యాలు నెరవేర్చేంత భక్తి ప్రపత్తులతో ఉన్నారు.

ఆ నాయకుడి పేరు భూపత్! కొన్ని సంవత్సరాలపాటు ఉత్తర భారతంలోని కొన్ని ప్రాంతాల్ని, ముఖ్యంగా సౌరాష్ట్రాల్ని గజగజ లాడించి తానే ఒక మహారాజుగా, పోటీ ప్రభుత్వాధి నేతగా ఉజ్వలంగా వెలిగిపోయిన బంది పోట్ల బృందం నాయకుడు.

అధికారిక లెక్కల ప్రకారమే భూపత్ చేసిన హత్యల సంఖ్య డెబ్బయి మాత్రం.

ఆ దళం ఆ విధంగా భూపత్ నాయకత్వాన దౌదర్డా గ్రామంలో ప్రవేశించింది. వెను వెంటనే గ్రామంలోని వారందర్నీ ఒక చోట మంద వేసి కొందర్నక్కడ కాపలా ఉంచి ముందుకుసాగింది.

ఆ గ్రామంలోని పోపట్‌లాల్ కుటుంబం అంటే ఊరందరికీ ప్రేమ. వారు ఊరి వారికి తలలో నాలుకల్లాంటి వారు. ఆ కుటుంబం మొత్తం ఆరుగురు అన్నదమ్ములు. వారు జాతీయ వాదులు, భూస్వాము లకు వ్యతిరేకులు. భూస్వాముల బంటయిన తాలూక్దారుకు పెద్ద తల నొప్పి. గ్రామస్తులకు వారిమాట సుగ్రీవాజ్ఞ. వారిప్పుడు భూస్వామి అక్రమాలకు వ్యతిరేకంగా గ్రామీణుల్ని కూడగడుతున్నారు. రానున్న ఎన్నికల్లో తన ఎన్నికకు తిరుగు లేదనుకుంటున్న మాజీ మహారాజా వారికి గొంతులో పచ్చి వెలక్కాయలా అడ్డు పడుతున్నారు.

అలాంటి పోపట్ సోదరుల గృహంపై భూపత్ బందిపోట్ల దళం విరుచుకపడింది. గోడలకున్న గాంధీగారి పటాల్ని ముక్కలు చెక్కలు చేసింది. రాట్నాలు విరగదన్నింది. అడ్డువచ్చిన ఇద్దరు పోపట్ సోదరుల గుండెల్లోంచి తలా ఆరు తూటాలూ నిర్దాక్షిణ్యంగా దూసుకు పోయాయి! వారు పడిపోయిన గది రక్తంతో నిండిపోయింది. అదృష్టం బాగుండి మిగతా నలుగురు సోదరులూ ఆ సమయాన పొరుగూళ్లో ఉన్నారు.

హత్యాకాండ తర్వాత మిగిలిన సోదరులు దొరకలేదన్న కసితో భూపత్ బృందం ఆ ఇంట్లో సామాగ్రి నంతా ధ్వంసం చేసేసింది. గ్రామస్తులను భోజనాలు వండుకు రమ్మని ఆదేశించి ఆ రక్తపు మడుగు ప్రక్కనే గ్రామఫోను పాటలు వింటూ విశ్రమించింది.

ఆ సాయంత్రం భూపత్ బృందం వెళ్తూ వెళ్తూ గ్రామంలో కాస్త పచ్చగా కనబడ్డ ఇళ్ళనన్నింటినీ లూటీ చేసింది. మాజీ మహారాజా వారికి ఎదురు చెప్పే ఎవరికయినా ఇదే గతి పడుతుందని దండోరా వేసి మరీ కదిలింది.

అప్పుడుగానీ అర్థం కాలేదు ప్రభుత్వానికి, బందిపోటు భూపత్ ఎవరి మనిషో !

భూపత్ బృందంలోని బందిపోట్లకు రోజువారీ ఖర్చు మూడు వందలు. మాజీ రాజులు ఇతని సాయంతో ప్రభుత్వాధికారాన్ని రానున్న ఎన్నికల్లో గెలవటం ద్వారా చేజిక్కించుకోవాలనీ, ఆ విధంగా తమ సంస్థానాలపై తమ అధికారాన్నే నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారనీ కాంగ్రెసు వారికి అర్థమైపోయింది.

అకస్మాత్తుగా 11మంది మాజీ మహారాజులు అరెస్టయ్యారు. సోదాల్లో వారికి బందిపోట్ల బృందాలతో గల సంబంధాలు వెల్లడయిపోయాయి. వారు వేలకు వేలు చందాలిస్తున్నట్లు సాక్ష్యాలు దొరికేయి.

కానీ...!

ఎంత గాలించినా భూపత్ మాత్రం దొరకలేదు.

సౌరాష్ట్ర ఎడారులూ, పాకిస్తాన్ సరిహద్దులోని దట్టమైన అడవులూ, గుట్టలూ అతని కేంద్రాలు. అక్కడ పోలీసు బలగాలు వెతుకుతూంటే భూపత్ బృందం ఏ మాజీ మహారాజావారి కోటలోనో హాయిగా తిని నిద్రబోతుండేది.

ఈ రహస్యం తెలిశాక రాజుల ఇళ్ళ మీద దాడులు జరిగేయి. భూపత్ బృందంలో చాలామంది దొరికిపోయేరు.

కానీ...! భూపత్ మాత్రం దొరకలేదు!

ఓ సుదినాన భూపత్ తమ పోలీసులకు దొరికిపోయినట్లు పాకిస్తానీ పత్రికలు ప్రకటిస్తే భారత పోలీసులు ఏడుపు మొహం పెట్టేరు. అప్పటికే కొన్ని నెలలుగా వారు భూపత్ కోసం సరిహద్దుల్లో అక్షరాలా జల్లెడతో గాలిస్తున్నారు. ప్రతి చోటా వలలు పన్ని కాచుక్కూచున్నారు.

అవన్నీదాటి భూపత్ పాకిస్తాన్‌కు పారిపోయేడు. ఎప్పుడయితే తన మహారాజ పోషకులు అరెస్టయి బజార్న పడ్డారో అప్పుడే అతడు తోక జాడించేడు.

భారత పోలీసులువెళ్లి పాకిస్తాన్ పోలీసుల్ని బతిమాలి అతన్నిక్కడకు లాక్కువచ్చేరు.

విచారించి యావజ్జీవ శిక్ష విధించేరు. ఆ తర్వాత కథ మనకు తెలుసు.

కానీ—!

తెలీని దేమంటే...

అతన్నీ, అతని బృందాన్నీ పోషించి అన్ని హత్యలూ, దోపిడీలూ చేయించిన రాజులూ, మాజీ మహారాజులూ మాత్రం ఆ తర్వాత...!

ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై, అసెంబ్లీలలోనూ పార్లమెంటుల లోనూ ప్రజాసేవ చేయసాగేరు.

★